

అలనాటి క్రికెటర్లతో

జట్టు గెలుచుకున్నది. సక్సెస్‌ఫుల్ క్రికెట్ కెప్టెన్‌గా సోలీని ఆకాశానికెత్తుతూ ఇంగ్లండ్ పత్రికలు వార్తలు కూడా ప్రచురించాయి.

### క్రికెట్‌కి రాచబాట

సోలీ సాధించిన విజయాల కన్నా తను విపరీతంగా ప్రేమించిన క్రికెట్ గురించే ఎక్కువగా తెలుసుకోవాలనిపిస్తుంది. సోలీ బాల్యమంతా వలసలు, పేదరికం, ఆకలితోనే గడిచింది. యవ్వనంలో క్రికెట్‌ని ప్రేమిస్తూనే.. పేదరికాన్ని గెలిచేందుకు పోరాడాడు. సోలీ ప్రేమలోనూ, పోరాటంలోనూ గెలిచాడు. తనలాంటి వాళ్లను కూడా గెలిపించాలని కలలుకన్నాడు. సోలీకి ఆదరణ వచ్చిన తర్వాత క్లబ్ క్రికెటర్లలో క్రేజ్ పెరిగింది. ఇతను ఎవరిని టీమ్‌లోకి తీసుకోమమంటే.. ఆ క్రికెటర్‌ను ఆయా క్లబ్‌లు తీసుకునేవి. మట్టిలో మాణిక్యాల్లాంటి ఆటగాళ్లను వెతికిపట్టాడు. బొంబాయి జట్టులో రంజీ ఆడే చంద్రకాంత్ పండిట్, రాజు కులకర్ణి, లాల్ చంద్ రాజ్‌పుత్, రవి ఠక్కర్‌లను ఇంగ్లండ్‌లోని క్రికెట్ క్లబ్బులను ఒప్పించి, అందులో చేర్పించాడు. క్రికెట్ నేర్చుకునే రోజుల్లో ఆర్థిక సమస్యలు వస్తే వాళ్లకు ఉద్యోగాలిప్పించాడు. ఆ తర్వాత వీళ్లంతా భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. తను ఏ క్లబ్బులో ఆడితే ఆ క్లబ్ ఆడే అవకాశం కల్పించేవాడు. అబ్దుల్ అజీమ్ (హైదరాబాద్), మెహందీ షేక్ (బరోడా), బరున్ బర్మన్ (కోల్‌కతా), మసూద్ అన్వర్ (పాకిస్థాన్), పాల్ బ్లాక్లీ, డేవిడ్ బాటీ, రషీద్ ఖాన్ (పాకిస్థాన్)లను సోలీ క్లబ్ క్రికెట్‌కి పరిచయం చేశాడు. క్లబ్ క్రికెట్‌లో ఆరితేరిన వీళ్లంతా.. ఆ తర్వాత ఆయా దేశాల జట్లకు ఎంపికయ్యారు. తనతో క్రాస్ బ్యాంక్ ముస్లిం క్లబ్ తరఫున ఆడిన మెహందీ షేక్.. భారత జట్టుకు కోచ్‌గానూ పని చేశాడు.

### శిఖరం చేరిన యోధుడు

ఇంగ్లండ్ ప్రతికలకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. 'సెంట్రల్ యార్క్‌షైర్ లీగ్ (సీవైఎల్)లో అన్ని టైటిల్స్ గెలిచాను. నేను గెలవాడనికి ఇంకేం లేదు. ఇంతకంటే ఉన్నతమైన దానికోసం వేరే లీగుల్లో ఆడతాను' అని ప్రకటించాడు సోలీ. అన్నట్టే 1988లో బాట్లీ క్రికెట్ క్లబ్‌ని వదిలేశాడు. సెంట్రల్ యార్క్‌షైర్ లీగ్ కంటే ఉన్నతమైన బ్రాడ్‌ఫోర్డ్ లీగ్‌లో ఆడాలని నిర్ణయించుకున్నాడు. స్పెన్ విక్టోరియా టీమ్‌లో చేరాడు. సోలీ ప్రతిభను గుర్తించిన ఆ టీమ్ కెప్టెన్.. తన బాధ్యతలను సోలీకి అప్పగించాడు. నయా కెప్టెన్ ప్రయోగాలతో ఆ టీమ్ అనేక విజయాలు సాధించింది. ప్రీస్ట్లీ కప్ చాంపియన్‌షిప్ (1990), బ్రాడ్‌ఫోర్డ్ లీగ్ చాంపియన్ షిప్‌తోపాటు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ బౌలర్ ఇలా ఎన్నో బహుమతులు గెలిచాడు సోలీ. ఆ లీగ్ ద్వారా గొప్ప పేరుగడించాడు. ఆ విజయాల పరంపరను గుర్తించిన కంబర్‌లాండ్ మైనర్ కౌంటీ.. తమ జట్టు తరఫున ఆడేందుకు సోలీకి ఆహ్వానం పంపింది. అప్పటికీ ఆయన వయసు 46 సంవత్సరాలు. సాధారణంగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు వీడ్కోలు పలికే వయసది. అయినా.. సోలీ కౌంటీలో అడుగుపెట్టాడు! ఇది కూడా ఒక రికార్డ్! రెండేళ్లపాటు కౌంటీ క్రికెట్‌లోనూ సత్తాచాటాడు. అయితే, ఇక్కడ ఆటగాళ్ల ప్రతిభ కంటే రూల్స్‌కే ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుందనీ, ఆటను ఆస్వాదించలేమని కౌంటీ క్రికెట్ నుంచి తప్పుకొన్నాడు. మళ్లీ స్పెన్ విక్టోరియా క్లబ్‌లో చేరాడు.

### గెలుపే కాదు.. గెలిపించు

ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రాణించినా.. ఇంగ్లండ్ క్రికెట్ జట్టు తరఫున ఆడాలని సోలీ ఏనాడూ అనుకోలేదు. ఆయనకు కావాల్సింది ఆటగాళ్లు మాత్రమే. నలభై ఏళ్ల క్రితం క్రికెట్ ఆటగాళ్లకు ఆదాయం చాలా తక్కువ. ఒక మ్యాచ్‌లో వచ్చిన పారితోషికంతో తర్వాత మ్యాచ్ వరకు ప్రాక్టీస్ అవసరాలు కూడా తీరేవి కావు. అలాంటి పరిస్థితుల్లో ఇంగ్లండ్ క్రికెట్ క్లబ్బుల నుంచి వెళ్లిపోకుండా.. క్రికెటర్లను కాపాడుకునే బాధ్యతను కూడా సోలీనే భుజాన వేసుకున్నాడు. తనకున్న పరిచయాలతో వారిని స్థానిక ఫ్యాక్టరీల్లో, షాపుల్లో ఉద్యోగాల్లో పెట్టించేవాడు. ఓవైపు ఉద్యోగాలు చేస్తూనే క్లబ్ క్రికెట్ ఆడుతూ ఆటలో ఆరితేరారు చాలామంది క్రికెటర్లు. అబే కురివిల్ల, జాన్ హుడ్, ఇక్బాల్ ఖాశీం, మహ్మద్ ఖైఫ్, మదన్‌లాల్, వసీం జాఫర్, వీవీఎస్ లక్ష్మణ్.. మరెందరో క్రికెటర్లు అక్కడ పనిచేస్తూ పైకొచ్చినవాళ్లే! ఆ కాలంలో.. భారత్‌లో క్రికెటర్లకు అంతగొప్ప శిక్షణా సంస్థలు ఉండేవి కావు. దాంతో తమ ప్రతిభకు సానపెట్టుకునేందుకు ఇంగ్లండ్‌లోని క్లబ్బుల్లో చేరి.. లీగ్‌లు ఆడుతూ అంతర్జాతీయ క్రికెట్‌కి రాచబాట వేసుకునేవారు. బౌండరీలకు ఆవల ఉన్నవాళ్లను ఆహ్వానించి క్లబ్బుల్లో చేర్పించేవాడు సోలీ. జతిన్ పరంజపే, ప్రణబ్ రాయ్, వినోద్ కాంబ్లీ, సచిన్ తెందూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, రోహన్ గవాస్కర్.. ఇలా ఎంతోమంది క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతాలు సృష్టించేందుకు మెరుగులుదిద్దాడు. సోలీ అండదండలతోనే ఇంగ్లండ్‌లో ఆడి, ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అడుగుపెట్టామని ఇండియా, పాకిస్థాన్ క్రీడాకారులెందరో పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొన్నారు కూడా.

### క్రికెటర్ల స్వర్గం

సోలీ ఇల్లు ఎప్పుడూ క్రికెటర్లతో కళకళలాడుతూ ఉండేది. భారత్, పాకిస్థాన్ క్రీడాకారులకు ఆ ఇల్లే షెల్టర్ జోన్. ఏ అర్ధరాత్రి వచ్చినా క్రికెట్ క్రీడాకారుల కోసం డ్యూస్‌బరీలోని సోలీ ఇంటి తలుపులు తెరిచే ఉండేవి. ఊరు, పేరు తెలియకపోయినా.. క్రికెట్ ఆటగాడినంటే ఆశ్రయమిచ్చేవాడు. అన్నం పెట్టేవాడు. ఇంగ్లండ్ క్రికెట్ క్లబ్బుల్లో ఆడేందుకు ఆహ్వానించిన క్రీడాకారుల్ని వదిలేయకుండా తన ఇంట్లోనే పెట్టుకునేవాడు. అలా.. ఎప్పుడూ 16 నుంచి 18 మంది క్రికెటర్లు సోలీ ఇళ్లలో ఉండేవాళ్లు. సునీల్ గవాస్కర్‌కి ఆ ఇంట్లో ప్రత్యేకమైన గది ఉండేది. గవాస్కర్ ఆ గదిలో పడుకుంటే.. పాకిస్థాన్ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ హాలులోని సోఫాలో నిద్రించేవాడు. దిలీప్ వెంగ్‌సర్కార్, సచిన్ తెందూల్కర్, వినోద్ కాంబ్లి.. ఆయన ఇంట్లో నెలల తరబడి ఉన్నవారే! మదన్‌లాల్, అజహరుద్దీన్, అబే కురువిల్ల, సురేశ్ శెట్టి, జాన్ హుడ్, వీవీఎస్ లక్ష్మణ్ ఇలా చెప్పుకొంటూ పోతే.. 300 మందికిపైగా అంతర్జాతీయ, ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు ఆ ఇంట ఆతిథ్యం అందుకున్నవాళ్లే! ఆశ్రయం పొందినవాళ్లే! ఇంగ్లండ్‌లో మ్యాచ్‌లు జరిగిన రోజుల్లో ఇండియన్ టీమ్ మొత్తం సోలీ ఇంట్లోనే డిన్నర్ చేసిన సందర్భాలు అనేకం! ఒక్కమాటలో చెప్పాలంటే.. భారతీయ క్రికెటర్లలో ఆ ఇంటి గడప తొక్కని వారు లేరంటే అతిశయోక్తికాదు. ■



కోటేశ్ దేవులపల్లి,
వర వంటపాటి, సత్యనారాయణ

### స్ఫూర్తినిచ్చే గాథ

సచిన్ టెండూల్కర్ ఆత్మకథ 'ప్లేయింగ్ విత్ మై వే'లో సోలీ ఆడమ్ గురించి చదివాను. నేనుండే బ్రాడ్‌ఫోర్డ్ పక్కనే డ్యూస్‌బరీ ఉంది. ఈ రెండూళ్ల మధ్య దూరం 15 కిలోమీటర్లే. ఫేస్‌బుక్ ద్వారా పరిచయం చేసుకున్నాను. తర్వాత తన స్టోర్‌కి వెళ్లాను. ఆయన చాలామంది క్రికెటర్లు గురించి చెప్పేవాడు. ఆశ్చర్యంగా వినేవాణ్ని. తను పాకిస్థానీ అనుకున్నా. కానీ, ఓ సందర్భంలో తనది గుజరాత్ అని చెప్పాడు. ఆ ఊరి నుంచి ఈ ఊరికి ఎలా వచ్చాడో చెప్పాడు. ఆ ప్రయాణం వింటే అంతకుముందు విన్న క్రికెటర్లతో సాన్నిహిత్యం కంటే ఇదే గొప్పగా అనిపించింది. అతని వలస జీవనం, క్రికెట్ మీద ప్రేమ తెలిశాక.. తన జీవితం పుస్తకంగా వస్తే సమాజానికి స్ఫూర్తినిస్తుందని చెప్పాను. తన కథ నన్నే రాయమన్నాడు. రెండేళ్లకుపైగా తనతో మాట్లాడుతూ, తనతో పరిచయమున్న క్రీడాకారులు వివరాలు సేకరిస్తూ పుస్తక రచన చేశాను. ఈ పనుల్లో నా భార్య అరుణ సహకారం ఉంది నా క్లాస్‌మేట్ సత్యనారాయణ ఫొటోలు, ఇంటర్నెట్‌లో సమాచారం సేకరించాడు. నేను రాస్తున్న సోలీ చరిత్రను ఎప్పటికప్పుడు మిత్రుడు కోటేశ్ దేవులపల్లితో చర్చిస్తూ, సవరిస్తూ 400 పేజీల 'సోలీ ఆడమ్.. బియాండ్ బౌండరీస్' పూర్తి చేశాను.

**- వర వంటపాటి**